క్లుప్తంగా

ఉద్యోగులకు సత్కారం



నంగవరంలో ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచులు వెంకటేశ్వరరావు, జంగమయ్య

ఉప్పలగుప్తం: నంగవరం, సన్నవిల్లి సచివాలయాల్లో ఉద్యోగులుగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులను ఇరు గ్రామాల సర్పంచులు జిన్నూరి వెంకటేశ్వరరావు, చిక్కం జంగమయ్య అధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధి మండల ఏపీఓగా పనిచేసి బదిలీ అయిన వి.రాజామణి, సచివాలయ ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి ఎ.రాజబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ టి.శివదుర్గాప్రసాద్, సర్వేయర్ యు.సాయిరామ్, మహిళా పోలీస్ డి.నాగదేవి, వెటర్నరీ అసిస్టెంట్ డి.నాగచందన, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.సత్యలను సర్పంచ్‌లతో పాటు ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, గ్రామస్తులు సత్కరించారు. మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, ఆకుల చిట్టిబాబ్జీ, కండవల్లి సత్యనారాయణ, గుండుమోగుల వెంకటనారాయణ, పినిపే బాబులు, ఏఎస్ఓ పి.సుదర్శన్, కార్యదర్శి మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సైగా సంపత్‌కుమార్



అల్లవరం: అల్లవరం ఎస్సైగా బి.సంపత్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం క్రైం బ్రాంచ్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత సంపత్‌కుమార్‌కు స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన తిరుమలరావు జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.


మత్తు పదార్థాల జోలికి పోవద్దు



కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్న బుర్రకథ బృందం

అమలాపురం టౌన్: మత్తు పదార్థాల జోలికి వెళ్లి అనర్థాలను కొనితెచ్చుకోవద్దని రామచంద్రపురం ఎండీ బాబ్జి బుర్రకథ బృందం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఈ మేరకు బుధవారం కళాజాత నిర్వహించింది. మాదక ద్రవ్యాలతో దుష్పరిణామాలు, అనివార్యమయ్యే ఆరోగ్య సమస్యలు, మొత్తంగా ఎదురయ్యే కష్టనష్టాలను కళాకారులు వివరించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన యువకులను తిరిగి మామూలు మనుషులను చేసేందుకు కౌన్సెలింగ్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాలతో జిల్లాలో కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని బుర్ర కథ ప్రధాన కళాకారుడు ఎండీ బాబ్జి తెలిపారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు తిలకించారు.

కరపత్రాల ఆవిష్కరణ



బుద్ధునితో నా ప్రయాణం నాటక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐ

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్ హాస్పిటల్ ఆడిటోరియంలో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అభ్యుదయ అకాడమీ కళాకారులచే 25న జరిగే బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శనకు సంబంధించి కరపత్రాలను డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు బుధవారం ఆవిష్కరించారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు రాంబోది కాశి డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబులకు ఆహ్వాన కరపత్రాలను అందజేసి గౌతమ బుద్ధుని యొక్క విశిష్టతను వివరించారు. బీఎస్ఐ జిల్లా కార్యదర్శి ములపర్తి సత్యనారాయణ, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల సీజ్



తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

అమలాపురం రూరల్: స్థానిక కిమ్స్ మెడికల్ కాలేజీ వద్ద బుధవారం రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్ చేస్తున్న కాలేజీ విద్యార్థుల 17 బైక్‌లు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. వాహనాల రిలీజ్ కోసం హెల్మెట్ తీసుకుని ఆర్‌టీఏ కార్యాలయానికి రావాలని విద్యార్థులకు డీటీఓ సూచించారు. త్వరలోనే రహదారి భద్రతపై అన్ని కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతి సురేష్ కౌశిక్ పాల్గొన్నారు.

వ్యవసాయం ఎక్కడో!



పోలేకుర్రులో ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసిన పొలం



లచ్చిపాలెంలో వేసిన నాట్లు

- పెట్టుబడి సాయం అందించని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ పథకానికి గ్రహణం
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

తాళ్లరేవు: దేశానికి అన్నం పెడుతున్న పుడమిపుత్రుల పరిస్థితి అగమ్యగోచరంలా తయారైంది. ఒక పక్క ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి కొరత, మరో పక్క ప్రకృతి వైపరీత్యాలతో కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ పంట పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నారుమడులు వేయడంతోపాటు వరి చేలు దమ్ము చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ, నేటికీ ఆ సాయం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 23 వేల ఎకరాలు, అమలాపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. సాగు ప్రారంభంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించినా అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు రైతుల అకౌంట్లలో జమ అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం స్పందించకపోవడంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. డబ్బులు జమ చేయకుండానే ఏడాది గడిచిపోయింది. కనీసం ఈ ఏడాదైనా వేస్తారా అని రైతులు ఆశగా ఉన్నారు.

గతమెంతో ఘనం..

వ్యవసాయానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ అండగా నిలిచింది. పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకుంది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు అటవీ, దేవదాయ భూములను సాగుచేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఊసెత్తకపోవడంతో అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతుంది. సాగు అంటే విసుగు పుట్టేలా కూటమి ప్రభుత్వం చేస్తుందని రైతన్నలు అంటున్నారు.

అప్పులు చేయాల్సిన పరిస్థితి



ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి. దాళ్వా పంట పెట్టుబడికే సరిపోయింది. పంట పండించి ప్రభుత్వానికి ఇస్తే రెండు నెలలకు గాని డబ్బులు జమ కాలేదు. దీంతో డబ్బులకు వడ్డీ కట్టడానికే సరిపోయింది. తొలకరి సాగు చేయాలంటే మరోసారి అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

– కొల్లు శ్రీను, రైతు, తాళ్లరేవు

పెట్టుబడి సాయం అందించాలి



వర్షాలు సకాలంలో కురవకపోవడం, అవసరం లేని సమయంలో పడుతుండడంతో ఆ ప్రభావం పంట దిగుబడిపై పడుతోంది. గత సీజన్‌లో వరి సాగు ప్రారంభం నుంచి వాతావరణం సరిగా లేక తీవ్ర నష్టం వాటిల్లింది. తీరా పంట చేతికి వచ్చి పట్టుబడులు సాగించే సమయంలో వర్షాలు నిరంతరాయంగా పడడంతో ధాన్యం మొలకెత్తి కొనేవారే కరవై అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి రావడమే కష్టమైంది. ఇప్పుడు సాగు ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలి.

– అనిశెట్టి సూర్యనారాయణ రెడ్డి, రైతు, లచ్చిపాలెం

మాజీ మంత్రిని కలసిన డాక్టర్ శ్రీకాంత్



రామచంద్రారెడ్డిని కలసిన అమలాపురం వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, జెడ్పీ చైర్మన్ వేణుగోపాల్

అమలాపురం టౌన్: రాజమహేంద్రవం సెంట్రల్ జైలులో ఉన్న తన కుమారుడు ఎంపీ మిథున్‌రెడ్డిని చూసేందుకు వచ్చిన ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వెలుపల మాజీ మంత్రి రామచంద్రారెడ్డిని కలిసినప్పుడు 'ఎవరూ ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని, ఇదంతా చంద్రబాబు పెట్టిన తప్పుడు కేసులేనని చెప్పారని డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. తప్పుడు కేసులను సమర్థవంతంగా, ధైర్యంగా ఎదుర్కొందామని రామచంద్రారెడ్డి పేర్కొన్నారని అన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నిహారిక

కాట్రేనికోన: బాల్య వివాహాలను ప్రోత్సహించడం కూడా నేరమే అవుతుందని మహిళా శిశు సంక్షేమ శాఖ ముమ్మిడివరం ప్రాజెక్టు సీడీపీఓ నిహారిక అన్నారు. కాట్రేనికోన మండల పరిషత్ సమావేశ భవనం వద్ద బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సూపర్ వైజర్ తులసి అధ్యక్షతన మండల స్థాయి చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపితే నిందితులకు రూ. లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. మహిళలు, బాలికలపై వేధింపులను అడ్డుకునేందుకు జిల్లా అధికారులకు, పోలీసు ఉన్నతాధికారులకు గ్రామ స్థాయి మానిటరింగ్ కమిటీలు సమాచారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ ఎంపీఎస్ లక్ష్మి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నివారణ చట్టాలపై వివరించారు. ఎంపీడీఓ వెంకటాచలం మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఏపీఓ శ్రీనివాసరాజు, ఎంఈఓ–2 ఎం.వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎల్‌వీ రమణి, తులసి తదితరులు పాల్గొన్నారు.

మనసారె కొలిచి..



పెదగాడవిల్లిలో సత్తెమ్మతల్లి సన్నిధిలో ఆషాఢ మాసం సారె

- అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ
- వైభవంగా ఊరేగింపులు

శాకంబరీగా సుబ్బాలమ్మ

అమలాపురం దేవత సుబ్బాలమ్మ వారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గణపతి కూరగాయల వర్తక సంఘం ప్రతినిధులు సమకూర్చిన దాదాపు టన్నున్నర కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారినే కాకుండా దేవస్థానం అంతటినీ కూరగాయల తోరణాలతో నింపేశారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతనిధులు పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, యర్రంశెట్టి మూర్తి, అరిగెల బాబ్జీ, భక్తులు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, అప్పన వీరన్న, గణపతి కూరగాయల వర్తక సంఘం ప్రతినిధి నిమ్మకాయల నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు.

ఉప్పలగుప్తం: పెదగాడవిల్లిలో సత్తెమ్మ తల్లికి ఆషాఢం సారెను భక్తులు సమర్పించారు. తొలుత భక్తులు గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి పలు రకాల వంటకాలను నైవేద్యంగా చెల్లించారు.

పాతకోరంగిలో..

తాళ్లరేవు: పాతకోరంగిలోని బాలాత్రిపుర సుందరీ అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. పురాతన బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామివారి ఆలయంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి ఏకాదశ అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజలను ఆలయ అర్చకుడు కేఆర్‌కే సాయిప్రసాద్ నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో సుమారు 100 కిలోల కూరగాయలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. సుమారు వంద కిలోల స్వీట్లను అమ్మవారికి ఆషాఢం సారెగా సమర్పించారు.

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి ఉన్న శ్రీదేవి అమ్మవారికి భక్తులు ఆషాఢం సారెను బుధవారం సమర్పించారు. రంగు రంగుల పాలకోవా దండను శ్రీదేవి అమ్మవారి మెడలో వేసి అలంకరించారు. అనంతరం అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. తొలుత సారెను స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి తర్వాత పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం వరకూ దాదాపు కిలోమీటరు మేర ఊరేగించారు. చివరగా సుబ్బాలమ్మ దేవస్థానం నుంచి సారెను శ్రీదేవి అమ్మవారి ఆలయానికి తోడ్కొని వచ్చి సమర్పించారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు మామిడిపల్లి రాంబాబు, ఆశెట్టి ఆదిబాబు తదితరుల పర్యవేక్షణలో సారె సమర్పణ జరిగింది.



ఆషాఢం సారెతో అమలాపురం శ్రీదేవి అమ్మవారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అలాగే సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారి ఆలయంలో విశేష పూజలు చేసి, స్వామి వారికి హారతులు సమర్పించారు.

ముత్యాలమ్మకు..

అమలాపురం రూరల్: పేరూరు పరిధిలోని కొంకాపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి భక్తులు సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ పనస ఈశ్వరరావు, మేడిచర్ల విఘ్నేశ్వరరావు, చవ్వాకుల చిన్న, గుమ్మళ్ల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. నల్లమిల్లిలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనవులమ్మ తల్లి అమ్మవారికి ఆషాఢ మాసం సారె, పసుపు నీళ్ల సమర్పణ జరిగింది.



అమలాపురంలో శాకంబరిగా సుబ్బాలమ్మవారు



పాతకోరంగి బాలాత్రిపురసుందరి అమ్మవారు



కురంగేశ్వరస్వామికి రుద్రాక్షలతో పూజలు



కొంకాపల్లి ముత్యాలమ్మ వారికి భక్తులు సమర్పించిన సారె

హార్బర్‌లో వసతుల కల్పనకు ప్రణాళిక



హార్బర్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: అంతర్వేది పల్లిపాలెంలోని మినీ ఫిషింగ్ హార్బర్‌లో పూర్తిస్థాయి వసతులు కల్పించేలా ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ తెలిపారు. బుధవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో మినీ ఫిషింగ్ హార్బర్ కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హార్బర్‌లో వసతుల కల్పనకు ప్రణాళికలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మినీ హార్బర్‌కు నీటి వసతి కోసం రూ.30 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలన్నారు. ఇక్కడ మెటీరియల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్డుకు రూ.20 లక్షలతో చేపట్టనున్నట్లు తెలిపారు. వసతుల కల్పనతో రోజూ సుమారు 200 పైబడి పడవలు రాకపోకలు సాగించి, చేపల ఎగుమతి, దిగుమతి జరిగి మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. విద్యుత్ సరఫరాకు రూ.19.5 లక్షలతో రెండు కిలోమీటర్ల మేర ఎల్టీ లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు. జేసీ టి.నిశాంతి, ఆర్డీఓ కె.మాధవి, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్లస్టర్ స్థాయి పోటీలకు హాజరైన వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు

యానాం: స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే క్లస్టర్ స్థాయి పోటీలను ప్రిన్సిపాల్ శ్రీపాదశరశ్చంద్రకీర్తి ప్రారంభించారు. ఈ క్రీడల్లో 8 జిల్లాల నుంచి క్రీడాకారులు వివిధ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి పోటీల్లో భాగంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడలు జరుగుతాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు, పశ్చిమ గోదావరి, భద్రాచలం, గుంటూరు, యానాం జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు వచ్చారన్నారు. పీఈటీ సి.లక్ష్మీప్రసన్న, సింహాచలం, సీనియర్ టీచర్లు సింహాద్రి అప్పన్న, జయప్రకాష్, శంకరరావు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌లో పాము

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియాన్ని చేర్చి ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో బుధవారం పాము దర్శనమివ్వడంతో క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓఎన్‌జీసీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.కోట్ల ఖర్చుతో స్విమ్మింగ్‌పూల్‌ను నిర్మించారు. కొన్ని నెలలుగా నిర్వహణను వదిలేయడంతో స్విమ్మింగ్‌పూల్ నీరంతా పచ్చగా మారింది. మరో రెండు రోజుల్లో ఇక్కడ క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో పాము కనిపించడంతో, దానిని స్థానికులు వల సహాయంతో బయటకు తీశారు.



స్విమ్మింగ్‌పూల్‌లో పట్టుకున్న పాము

చెత్త తొలగించి... మొక్కలు వేసి

అమలాపురం టౌన్: అది ఈదరపల్లి– నల్ల వంతెన మధ్య ఉన్న పట్టణ బైపాస్ రోడ్డు. ఈ రహదారిలో కంపోస్టు యార్డు, శ్మశానం ఉన్నాయి. వీటికి సమీపంలో నల్ల వంతెన వైపు ఉన్న రోడ్డు రెండు చెంతలా పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో మఖ్యంగా తాగి పాడేసిన కొబ్బరి బొండాలు ఇలా నానా చెత్త తిష్ట వేసింది. నిన్నటి వరకూ అధ్వానంగా ఆ రోడ్డు మార్జిన్లు ఇప్పుడు పచ్చదనంతో మొక్కలు నాటి ఉద్యాన వనంగా మారింది. ఈ రోడ్డు వెంబడి వెళితే భరించలేని దుర్వాసన వెదజల్లేది. ఓ పక్క పిచ్చి మొక్కలు, తుప్పలు, మరోపక్క చెత్త కుప్పలు ఇలా చూసేందుకే దారుణంగా ఉండేది. అలాంటి రోడ్డును ఇప్పుడు మున్సిపాలిటీ చెత్త కుప్పలు, తుప్పలను తొలగించి పచ్చని మొక్కలు నాటింది. మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ ఈ పనులను పారిశుధ్య సిబ్బందిచే చేయించారు. వార్డుల సచివాలయాల పారిశుధ్య కార్యదర్శులు ఈ పనులను పర్యవేక్షించారు.



అమలాపురం బైసాస్ రోడ్డు చెంత తుప్పలను తొలగించి వేసిన మొక్కలు

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

అమలాపురం టౌన్: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిందని, దాని అమలుకు అమలాపురంలోని వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ అన్నారు. పట్టణంలోని ప్లాస్టిక్ డిస్పోజల్స్ విక్రయించే హోల్‌సేల్, రిటైల్ షాపుల వ్యాపారులు, హోటళ్ల యజమానులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ నిర్మల్‌కుమార్ మాట్లాడారు. ప్లాస్టిక్ డిస్పోజల్స్ విక్రయించే వ్యాపారులు ఇక నుంచి అమ్మకాలను నిలిపివేయాలని సూచించారు. అలాగే వినియోగదారులు వస్త్ర, నార, పేపర్ సంచుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. డ్రైన్లలోకి హోటళ్ల వ్యర్థాలను పడవేస్తే ఇక నుంచి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. చెత్త బయట పడేయకుండా చెత్త డబ్బాల్లోనే వేసి ఉంచాలని సూచించారు. మీ వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు చెత్త డబ్బాలను మాత్రమే ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి హోటల్ యజమాని ట్రేడ్ లైసెన్స్‌ను విధిగా కలిగి ఉండాలన్నారు. ఉంటే సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని అన్నారు.



వ్యాపారులు, హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్

సమావేశంలో శానిటేషన్ సిబ్బంది, వార్డుల సచివాలయాల ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న జెడ్పీ సీఈఓ

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తిరునాగరి సుగుణ కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నట్లు జెడ్పీ సీఈఓ లక్ష్మణ్ ప్రకటించారు. బుధవారం ఆయన కోరంగి పంచాయతీలో పర్యటించారు. తొలుత గ్రామంలో పారిశుధ్యంపై ఆరా తీసి ప్రజలతో మాట్లాడారు. అనంతరం స్థానిక సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శి రమణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుగుణ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బంగారు కుటుంబం (పీ–4 పథకం) లో భాగంగా ఆ కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నానని సీఈఓ తెలిపారు.

బీవీసీలో రక్తదాన శిబిరం

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని బీవీసీ కళాశాలల అధినేత బోనం కనకయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి సంవత్సరం రక్తదానం చేయాలని సూచించారు. సుమారు 105 మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ దుర్గారావు, పీడీ రవిసుధీర్ తెలిపారు. ఈ రక్తాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రక్త నిధికి ఇస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ముమ్మిడివరం: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలంక బ్రేకర్ ఏర్పాటు చేసే నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ముమ్మిడివరం పరిధిలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అమలాపురం ఈఈ రాంబాబు తెలిపారు.

షాపుల లైసెన్స్‌కు దరఖాస్తులు

యానాం: దీపావళికి బాణసంచా అమ్మకాలకు రిటైల్ అవుట్‌లెట్‌లకు తాత్కాలిక లైసెన్స్‌లు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని బుధవారం అధికారులు తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు ఈ నెల 24 నుంచి ఆగస్టు 21 వరకూ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.